క్లుప్తంగా

నేడు నిడదవోలు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నిడదవోలు: మునిసిపల్ కౌన్సిల్ పాలకవర్గ సాధారణ సమావేశాన్ని గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ రాంభూపాల్‌రెడ్డి బుధవారం తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి అధికారులు, కౌన్సిల్ సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.

15న కొవ్వూరు మునిసిపల్ సమావేశం

కొవ్వూరు: మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 15వ తేదీ ఉదయం 11 గంటలకు జరుగుతుందని మున్సిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి బుధవారం తెలిపారు. పట్టణంలో చేపట్టే వివిధ అభివృద్ధి పనులపై ఈ సమావేశంలో సమీక్షిస్తామని తెలిపారు. కావున సభ్యులంతా విధిగా ఈ సమావేశానికి హాజరు కావాలని ఆమె కోరారు.

మూడు రోజుల పాటు విద్యుత్‌కు అంతరాయం

ఉండ్రాజవరం: ఉండ్రాజవరం–సత్యవాడ 11 కేవీ ఫీడర్‌లో ఆర్‌డీఎస్ఎస్ పనులు జరుగుతున్నందున గురువారం నుంచి శనివారం వరకూ మూడు రోజుల పాటు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ సత్యవాడ గ్రామంతో పాటు ఉండ్రాజవరం వ్యవసాయ కనెక్షన్లకు సరాఫరాను నిలిపివేస్తామని ట్రాన్స్‌కో నిడదవోలు ఈఈ బి.వీరభద్రరావు బుధవారం తెలిపారు. వ్యవసాయ విద్యుత్ సరాఫరా మధ్యాహ్నం 12 గంటల నుంచి ఇచ్చేలా మార్పు చేసినట్లు తెలిపారు.

రేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

నల్లజర్ల: అనంతపల్లి, కృష్ణమ్మగూడెం గ్రామాల్లో ఈ నెల 14వ తేదీ ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నట్టు ఆ శాఖ నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వీరభద్రరావు బుధవారం తెలిపారు. విద్యుత్తు వినియోగదారులు సహకరించాలని కోరారు.

దేవరపల్లి వద్ద ట్రాఫిక్ మళ్లింపు



దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద ట్రాఫిక్‌ను మళ్లిస్తున్న పోలీసులు

దేవరపల్లి: నూతన ముఖ్యమంత్రిగా ఎస్.చంద్రబాబునాయుడు బుధవారం గన్నవరం వద్ద ప్రమాణ స్వీకారం చేసేందుకు పోలీసులు ట్రాఫిక్‌ను అధికారులు క్రమబద్ధీకరించారు. దేవరపల్లి–గోపాలపురం రోడ్డులోని హైవే డై మండ్ జంక్షన్ వద్ద గోపాలపురం, జంగారెడ్డిగూడెం మీదుగా విజయవాడ వైపు వెళ్లే వాహనాలను పోలీసులు మళ్లించారు. ఉదయం 6 నుంచి రాత్రి వరకు ట్రాఫిక్ మళ్లించి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. కార్లు, బైక్‌లు, ఆటోలను యథావిధిగా పంపించారు.

హోదా సాధనపై దృష్టి సారించాలి

గోపాలపురం: రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధనపై దృష్టి సారించాలని, కోటి ఆశలతో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని నిలుపుకోవాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి జేష్ఠ సతీష్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఏపీ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నారా చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్‌లు కేంద్రం నుంచి రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం సాధనపై దృష్టి పెట్టాలన్నారు. విభజన హామీలు అమలయ్యేలా కృషి చేయాలని సతీష్‌బాబు కోరారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మొక్కులు చెల్లించుకున్న కూటమి నాయకులు

నిడదవోలు రూరల్: ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు, మంత్రులుగా పవన్‌కల్యాణ్, కందుల దుర్గేష్‌లు ప్రమాణ స్వీకారం చేయడంతో మండలంలోని సమిశ్రగూడెం గ్రామంలో కూటమి పార్టీల నాయకులు బుధవారం మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక పుంతలో ముసలమ్మ, నంగాలమ్మ ఆలయాల వద్ద 108 కొబ్బరికాయలు కొట్టారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు గోగిన శ్రీనివాసరావు, నిమ్మగడ్డ హరిబాబు, జనసేన నాయకులు ఉప్పులూరి రామ్మోహన్‌రావు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

నిడదవోలులో సంబరాలు

నిడదవోలు: స్థానిక జనసేన పార్టీ ఎమ్మెల్యే కందుల దుర్గేష్ బుధవారం రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో పట్టణంలోని జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. జై చంద్రబాబు, జై పవన్ కల్యాణ్ అంటూ నినదించారు. కార్యక్రమంలో జనసేన పట్టణశాఖ అధ్యక్షుడు రంగా రమేష్, టీడీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు కారింకి సాయిబాబు, ప్రముఖ వైద్యుడు కల్యాణ చక్రవర్తి, టీడీపీ కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు, గంట శ్రీనివాసరావు, గ్రంధి బాలాజీ, శివ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు సిద్ధం



దేవరపల్లి మండల విద్యావనరుల కేంద్రంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న పాఠ్యపుస్తకాలు



దేవరపల్లిలో పాఠశాలలకు సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్న షూస్, బెల్టులు

- గోపాలపురం నియోజకవర్గంలో 150 పాఠశాలలు
- 16,206 మంది విద్యార్థులు
- మండల విద్యావనరుల కేంద్రాలకు చేరిన పుస్తకాలు
- పాఠశాలలకు సరఫరా ప్రారంభం

దేవరపల్లి: వేసవి సెలవుల అనంతరం గురువారం నుంచి పాఠశాలలను తెరుస్తున్నారు. ఇందుకోసం పాఠశాలను ముస్తాబు చేస్తున్నారు. పాఠశాలల ప్రాంగణాలు, తరగతి గదులను శుభ్రం చేస్తున్నారు. నూతన విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాం, బెల్టులు, షూస్‌ను ప్రభుత్వం సిద్ధం చేసింది. వాటిని మండల కేంద్రాల్లోని విద్యావనరుల కేంద్రాలకు ఇప్పటికే తరలించి భద్రపరిచారు. బుధవారం నుంచి ఆయా పాఠశాలలకు విద్యా కిట్లను సరఫరా చేయనున్నట్టు విద్యాశాఖ అధికారులు తెలిపారు. వీటినే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విద్యా కానుకలుగా వ్యవహరించేవారు. పాఠ్య పుస్తకాలు 70 శాతం, నోట్ పుస్తకాలు, బెల్టులు, షూస్ పూర్తిగా ప్రభుత్వం సరఫరా చేసినట్టు విద్యాశాఖాధికారులు తెలిపారు. 7వ తరగతి, 3, 4 తరగతులకు అవసరమైన కొన్ని పాఠ్య పుస్తకాలు ఇంకా రావలసి ఉన్నాయి. 8,9,10 తరగతుల విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలు పూర్తిగా వచ్చినట్టు అధికారులు తెలిపారు. పాఠశాలలు తెరవక ముందే పుస్తకాలు పంపిణీకి అధికారులు చర్యలు చేపట్టారు.

16,206 మంది విద్యార్థులకు కిట్లు

గోపాలపురం నియోజకవర్గంలోని దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల్లో 150 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, వాటిలో 16206 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారందరికీ ప్రభుత్వం ఉచితంగా పుస్తకాలు, నోట్స్, బెల్టులు, రెండు జతల యూనిఫాం, షూస్ అందజేస్తోంది. దేవరపల్లి మండలంలోని 45 పాఠశాలల్లో 5,233 మంది, నల్లజర్ల మండలంలోని 53 పాఠశాలల్లో 5,353 మంది, గోపాలపురం మండలంలోని 52 పాఠశాలల్లో 5620 మంది విద్యార్థులు ఉన్నారు. గోపాలపురం మండలంలో 1 నుంచి 7వ తరగతి విద్యార్థులకు బ్యాగులు, యూనిఫాం రావాల్సి ఉంది. దేవరపల్లి మండలానికి 45,075 పుస్తకాలు అవసరం కాగా, ఇప్పటి వరకూ 20, 054 పాఠ్యపుస్తకాలు మండల కేంద్రానికి వచ్చాయి.

70 శాతం పాఠ్యపుస్తకాలు సిద్ధం



నూతన విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, నోట్‌పుస్తకాలు, బెల్టులు, షూస్, బ్యాగులను పంపిణీని సిద్ధం చేశాం. 70 శాతం పాఠ్యపుస్తకాలు వచ్చాయి. మిగిలిన పుస్తకాలు త్వరలో వస్తాయి. నోట్స్‌పుస్తకాలు, బ్యాగులు, బెల్టులు, యూనిఫాం, సిద్ధంగా ఉన్నాయి. పాఠశాలలు తెరవడానికి ఒక రోజు ముందే వాటికి అందజేస్తాం. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు గురువారం నుంచి పాఠశాలలు తెరుస్తున్నాం. బడిఈడు పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా చర్యలు చేపట్టాం.

– కేఆర్ఎస్‌వీవీ అప్పారావు, ఎంఈఓ–2, దేవరపల్లి

చెరువుల లీజులో జీవోలను పాటించాలి

- రజక జన సంఘం జిల్లా అధ్యక్షుడు చిలకపల్లి కట్లయ్య
- కొవ్వూరు డీఎల్‌పీవోకి ఫిర్యాదు



కొవ్వూరులో డీఎల్‌పీవో అమ్మాజీకి ఫిర్యాదు చేస్తున్న రజక జన సంఘం జిల్లా అధ్యక్షుడు చిలకపల్లి కట్లయ్య,నాయకులు

కొవ్వూరు: అవగాహన లేకుండా అధికారులు రజకుల చెరువులకు శిస్తులు విధిస్తున్నారని, దీనివల్ల రజక వృత్తిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రజక జన సంఘం జిల్లా అధ్యక్షుడు చిలకపల్లి కట్లయ్య ఆరోపించారు. పెరవలి మండలం కానూరు అగ్రహారం గ్రామంలో 24 ఏళ్లుగా ఉన్న రజకుల వృత్తి చెరువు లీజు విషయంపై కొవ్వూరు వచ్చి డీఎల్‌పీవో అమ్మాజీకి బుధవారం ఆయన ఫిర్యాదు చేశారు. రజకుల చెరువుల లీజు విషయంలో కింది స్థాయి అధికారులు అవగాహనా లోపంతో ప్రభుత్వం ఇచ్చిన జీవోలను అమలు చేయడం లేదని ఆరోపించారు. పంచాయతీలు లీజు కేటాయింపులోను జీవోలను కచ్చితంగా అనురించాలని కోరారు. డివిజన్‌లో రజకుల చెరువులకు విస్తీర్ణాన్ని బట్టి లీజు నిర్ధారణ చేయాల్సి ఉందన్నారు. రజకుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారుల క్షేత్ర స్థాయిలో పర్యటించి లీజులను నిర్ధారించాలని కోరారు. లీజు విషయంపై కింది స్థాయి అధికారులకు స్పష్టమైన ఆదేశాలిస్తామని డీఎల్‌పీవో అమ్మాజీ హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. అగ్రహారపు ఉపరయ్య, సాంబయ్య, కావలి సతీష్, అగ్రహారపు పెద్ద వెంకన్న, గన్నవరపు వెంకన్న, అల్లం కొండయ్య, గన్నవరపు వెంకన్న, విఠాల శ్రీనివాస్, కడెల్లి సుబ్బయ్య, వట్లూరి మురళి పాల్గొన్నారు.

నూతన మంత్రివర్గ ప్రమాణం లైవ్ షో



తాళ్లపూడి మండలం బల్లిపాడులో చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని తిలకిస్తున్న ప్రజలు

తాళ్లపూడి: ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు, రాష్ట్ర మంత్రుల ప్రమాణ స్వీకారోత్సవ ప్రత్యక్ష ప్రసారాన్ని బుధవారం ఎల్ఈడీ స్క్రీన్‌పై బల్లిపాడులోని కాకర్ల రామయ్య ఫంక్షన్ హాల్ వద్ద ఏర్పాటు చేశారు. ఈ ప్రసారాన్ని టీడీపీ మండల నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది తిలకించారు. అనంతరం కేక్ కట్ చేశారు. పవన్ కల్యాణ్ ప్రమాణ స్వీకారం సందర్భంగా ఆయన అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ తహసీల్దార్ శ్రీనివాసరావు, సిబ్బంది అమ్మిరాజు, వీఆర్వోలు పాల్గొన్నారు.

టీడీపీ శ్రేణుల వేడుకలు

దేవరపల్లి: రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా ఎన్.చంద్రబాబు నాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా దేవరపల్లిలో టీడీపీ శ్రేణులు వేడుకలు నిర్వహించారు. టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీ రామారావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్‌లు కట్ చేసి కార్యకర్తలకు పంచారు. దేవరపల్లిలోని బస్టాండ్ వద్ద గల ఎన్టీఆర్ విగ్రహానికి పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. పార్టీ పట్టణశాఖ అధ్యక్షుడు గద్దే సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఓరుగంటి లక్ష్మీపతిరాజు, కరుటూరి బాలాజీ, యాగంటి సుబ్రహ్మణ్యం, కరుటూరి శ్రీనివాస్, సింహాద్రి రామకృష్ణ, కడియం సత్తిబాబు, నడింపపల్లి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం



దాత వెంకట సూర్యనారాయణకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు బుధవారం రూ. 1,00,000 విరాళంగా అందజేశారు. తాడేపల్లిగూడెంకు చెందిన అల్లూరి సురేష్‌కుమార్ ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

'మానవత' ఆర్థిక సహాయం



బాధిత కుటుంబానికి నిత్యావసరాలు, నగదు సాయం అందించిన మానవత సంస్థ సభ్యులు

గోపాలపురం: ఇటీవల సంభవించిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మండలంలోని పెద్దాపురానికి చెందిన బంటు తిరుపతయ్యకు చెందిన తాటాకిల్లు పూర్తిగా కాలిపోయింది. విషయం తెలుసుకున్న మానవత స్వచ్ఛందసేవా సంస్థ మండల శాఖ సభ్యులు బుధవారం ఆ గ్రామం వెళ్లి బాధిత కుటుంబానికి నిత్యావసర వస్తువులు, నగదు అందజేశారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ రాంబాబు, పప్పు సత్యకృష్ణారెడ్డి, నెల్లి చంద్రశేఖర్, కె.నాగరాజు, కె. కీర్తికుమార్, జుత్తిగ సూర్యచంద్రం మండల మానవత సభ్యులు పాల్గొన్నారు.

అన్నమాచార్య విగ్రహం వద్ద పాడపాము హల్‌చల్



అన్నమాచార్య విగ్రహం వద్ద గార్డెన్‌లోని నీటిలో వెళుతున్న పాడ పాము

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంలోని అన్నమాచార్య విగ్రహం వద్ద ఒక పాడపాము బుధవారం ఉదయం హల్‌చల్ చేసింది. వివరాల్లోకి వెళితే.. చినవెంకన్న దర్శనార్థం భక్తులు వైకుంఠం క్యూ కాంప్లెక్స్ గుండా ఆలయంలోకి వెళుతున్నారు. ఆ సమయంలో క్యూ కాంప్లెక్స్ పక్కన అన్నమాచార్యుని విగ్రహం వద్ద గార్డెన్‌లోకి ఒక పాడపాము ప్రవేశించింది. నీటిలో వెళుతున్న ఆ పామును చూసి అక్కడున్న భక్తులు భీతిల్లారు. అయితే పాము పక్కనే ఉన్న మొక్కల్లోకి వెళ్లిపోయింది. దాంతో భక్తులు ఊపిరి పీల్చుకున్నారు.

జక్కంపూడి చిన్ని సేవలు చిరస్మరణీయం



చిన్ని చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ముద్రగడ పద్మనాభం, చిత్రంలో జక్కంపూడి రాజా, ఆకుల వీర్రాజు తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: దివంగత మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు సోదరుడు జక్కంపూడి శ్రీనివాసరావు (చిన్ని) మృతి కాపు ఉద్యమానికి తీరని లోటు అని కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం అన్నారు. స్థానిక నారాయణపురంలోని జక్కంపూడి చిన్ని కుటుంబ సభ్యులను బుధవారం ఆయన పరామర్శించారు. చిన్ని చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. చిన్ని కుటుంబానికి అండగా ఉంటానని కుమారుడు జక్కంపూడి రాహుల్ దత్తాకు ధైర్యం చెప్పారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, కురుమళ్ల ఆంజనేయులు, అడపా వెంకట రమణ, మందారపు వీర్రాజు, లంక సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

కంబాలచెరువు: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎం.అనురాధ ఆధ్వర్యంలో బుధవారం కార్మిక, ఇతర శాఖలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరు నుంచి 14 ఏళ్ల వయసున్న పిల్లలు ఉచిత నిర్బంధ విద్య పొందడం వారికి రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. ఈ వయసులో ఉన్న పిల్లలను కార్మికులుగా మార్చడం నేరమని, అలా చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. పిల్లల భద్రత దృష్ట్యా సంబంధిత అధికారులు, వ్యవస్థలు మరింత పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లలందరికీ మంచి విద్య, స్వేచ్ఛగా జీవించే పరిస్థితులను కల్పించడం అందరి బాధ్యత అన్నారు. ఎలాంటి న్యాయ సహాయం కావాలన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు తెలియజేయాలన్నారు. వారి సమస్యలను ఎప్పటికప్పుడు సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు టీఎస్ కార్తీక్, షేక్ జబీనా, గరల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డి.ఎస్తేర్ రాణి, డీసీపీవో పేనల్ లాయర్ ఎంవీ శేషమ్మ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

బియ్యం, నిత్యావసరాల వితరణ

ప్రకాశం నగర్: దేవదాయ ధర్మదాయశాఖ ఆధ్వర్యంలోని నడుస్తున్న కోటిలింగాల పేటలోని పందిరి మహదేవుడు కోటిలింగాల సత్రానికి వెంకటేశ్వర ఫైనాన్స్ అధినేత రావిపాటి మదనగోపాల్, సీతా వెంకటలక్ష్మి దంపతులు బుధవారం రూ.55 వేలు విలువైన బియ్యం, నిత్యావసరాలు వితరణ చేశారు.

15న ఆర్ట్స్ కళాశాలలో ఇంటర్వ్యూలు

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఈ నెల 15వ తేదీన ఎంఎస్ఎన్ ల్యాబ్ క్యాంపస్ ఇంటర్వ్యూలు జరుగుతాయని ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. 2023 – 24 లో ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ, ఎంఎల్‌టీ (బ్రిడ్జి కోర్సు)తో పాటు పదో తరగతిలో 60 శాతం మార్కులు, ఇంటర్మీడియట్ ఒకేసారి పాసైన 20 ఏళ్లలోపు పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



శ్రీరామ్ మృతదేహం

రాజమహేంద్రవరం రూరల్: వ్యక్తి అనుమానాస్పద మృతిపై బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. కరప మండలం కూరాడ గ్రామానికి చెందిన రెడ్డిపల్లి శ్రీరామచంద్రమూర్తి ఎలియాస్ శ్రీరామ్ (35) లాలాచెరువు స్పిన్నింగ్ కాలనీలో నివసిస్తున్నాడు. ఇతడికి వీరలక్ష్మితో సుమారు ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. ఈ దంపతులకు సంతానం లేకపోవడంతో మూడేళ్ల క్రితం బంధువుల అమ్మాయి శ్రీలియాను దత్తత తీసుకున్నారు. కాగా.. శ్రీరామ్ ఏడాది క్రితం యమహా షోరూంలో పనిచేస్తున్నప్పుడు కస్టమర్‌గా వచ్చిన శాటిలైట్ సిటీ ఇందిరమ్మ కాలనీకి చెందిన గొండేపి దేవితో పరిచయం ఏర్పడింది. ఆమె ఇంటి దగ్గరే అతడు ఎక్కువగా ఉండేవాడు. ఆరు నెలల క్రితం భార్య వీరలక్ష్మి వద్దకు వచ్చి, 20 రోజులు ఉండి వెళ్లిపోయాడు. కాగా.. శ్రీరామ్ జాంపేటలో పాన్‌షాపు నిర్వహిస్తున్నాడు. వారం రోజుల క్రితం తన బంధువైన రెడ్డిపల్లి లక్ష్మణమూర్తి ద్వారా భార్య వీరలక్ష్మికి ఫోన్ చేసి వీడియో కాల్ మాట్లాడారు. తన షాపు వద్దకు రావాలని భార్యను కోరాడు. దీంతో వీరలక్ష్మి పాన్ షాప్ వద్దకు వెళ్లగా శ్రీరామ్ కాళ్లకు, తలకు రక్తపు గాయాలు కనిపించాయి. ఏమైందని ఆమె ప్రశ్నించగా బండిపై నుంచి పడిపోయానని చెప్పాడు. దీంతో వీరలక్ష్మి తన భర్త శ్రీరామ్‌కు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేయించింది. అప్పటి నుంచి ఆమె వద్దే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 9వ తేదీ అర్ధరాత్రి వరకూ శ్రీరామ్ ఇంటికి రాలేదు. అతడికి ఫోన్ చేసినా మాట్లాడలేదు. దీంతో గొండేపి దేవి వద్దకు వెళ్లిపోయాడనుకుని వీరలక్ష్మి ఊరుకుంది. అయితే బుధవారం ఉదయం 10 గంటల సమయంలో ఆమెకు ఫోన్ వచ్చింది. డీటీసీ నుంచి శ్రీరామపురం వెళ్లే రోడ్డుతో శ్రీరామ్ మృతి చెందాడని దాని సమాచారం. వీరలక్ష్మి అక్కడకు వెళ్లి చూడగా శ్రీరామ్ అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. ఆమె ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై ఆర్.అంకారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూమి సేద్యపు బహిరంగ వేలం ప్రకటన

తూర్పుగోదావరి జిల్లా, పెరవలి మండలం, ఉండ్రాజవరం మండలంలో గల దేవాదాయ ధర్మదాయ శాఖ [illegible] భూములు బహిరంగ వేలం సేద్యపు కౌలు హక్కు వేలం పాట 2024–2025 నుండి 2026–2027 [illegible]

క్ర. నెం.	దేవస్థానం పేరు	భూమియున్న గ్రామం, మండలం	ఆర్.యస్. నెం.	య. సెంట్లు	వేలంపాట జరుగు ప్రదేశం తేది మరియు సమయం
1.	శ్రీ[illegible]స్వామి వారి దేవస్థానం, కానూరు(గ్రా.) పెరవలి (మం.),తూ.గో.జిల్లా	కానూరు (గ్రా.) పెరవలి (మం.)	178	4–15	18–06–2024 ఉదయం 10.00 గం.లకు శ్రీ స్వామి వారి దేవస్థానం నందు
2.	శ్రీ[illegible]స్వామి వారి దేవస్థానం, కానూరు(గ్రా.) పెరవలి (మం.),తూ.గో.జిల్లా	కానూరు (గ్రా.) పెరవలి (మం.)	174/1	3–34	18–06–2024 ఉదయం 11.00 గం.లకు శ్రీ స్వామి వారి దేవస్థానం నందు
3.	శ్రీ[illegible]స్వామి వారి దేవస్థానం, [illegible](గ్రా.) ఉండ్రాజవరం (మం.),తూ.గో.జిల్లా	[illegible] (గ్రా.) ఉండ్రాజవరం (మం.) [illegible] (గ్రా.), ఉండ్రాజవరం (మం.)	198/2A 300/1 28	[illegible] 0.44	18–06–2024 ఉదయం 11.45 గం.లకు శ్రీ స్వామి వారి దేవస్థానం నందు
4.	శ్రీ[illegible]స్వామి వారి దేవస్థానం, కానూరు అగ్రహారం(గ్రా.) పెరవలి (మం.),తూ.గో.జిల్లా	కానూరు అగ్రహారం పెరవలి మండలం	9 30,81,82 182/4	6–91 1–84 2–10	19–06–2024 మధ్యాహ్నం 03.00 గం.లకు శ్రీ స్వామి వారి దేవస్థానం నందు

తేది : 12–06–2024, కానూరు. సం/- : కార్యనిర్వహణాధికారి, సెల్ 93214 93250

నేరేడు పండు.. లాభాలు మెండు..

- కాయ నుంచి బెరడు వరకూ ఔషధ గుణాలు
- సర్వరోగ నివారిణి



అమ్మకానికి సిద్ధం చేసిన అల్ల నేరేడు పండ్లు

రాజమహేంద్రవరం రూరల్: సీజన్ల వారీగా లభించే పండ్లు తినడం వల్ల శరీరానికి రోగాల నుంచి రక్షణ లభిస్తుందని, సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని వైద్యులు చెబుతూ ఉంటారు. మన పూర్వీకులు ఈ విధానాలను పాటించడం వల్ల చాలా ఆరోగ్యంగా ఉండేవారు. ఇప్పుడిప్పుడే వీటిపై కూడా ప్రజలకు అవగాహన పెరుగుతోంది. ప్రస్తుతం అన్ని సీజన్ల పండ్లు ప్రజలకు అందుబాటులో ఉంటున్నాయి. రోడ్ల పక్కనే దుకాణాలలో చాలా సులభంగా దొరుకుతున్నాయి.

అల్ల నేరేడు పండ్లు

మన ఆరోగ్యానికి మేలు చేసే పండ్లలో అల్ల నేరేడు పండ్లు ఒకటి. ప్రస్తుతం వీటి సీజన్ నడుస్తోంది. రక్తాన్ని శుద్ధి చేయడంతో పాటు పోషకాలను అందించే గుణం వీటికి ఉంది. నేరేడు పండ్లు కొంచెం తియ్యగా, వగరుగా ఉంటాయి. వీటిని జంబూఫలం, జామూన్‌గా కూడా పిలుస్తారు. నేరేడు పండ్లను ఆయుర్వేద శాస్త్రంలో అపర సంజీవనిగా పిలుస్తారు. వీటిలో విటమిన్ ఏ, సీ అధికంగా ఉంటాయి. ఆక్సాలిన్ ఆమ్లం ఒక ప్రత్యేకమైన రుచిని పండుకు అందిస్తుంది.

కిలో రూ.250

మన జిల్లాతో పాటు చిత్తూరు, కృష్ణా జిల్లాలో నేరేడు పండ్లు ఎక్కువగా దొరుకుతాయి. అక్కడి నుంచి దిగుమతి చేసుకుని మార్కెట్‌లలో విక్రయిస్తుంటారు. ప్రస్తుతం కిలో నేరేడు పండ్లను రూ.200 నుంచి రూ.250 వరకూ విక్రయిస్తున్నారు. మధుమేహం, రక్తహీనత, బీపీ, కిడ్నీ సమస్యలతో బాధపడేవారికి ఇవి ఔషధంగా పనిచేస్తాయని వైద్యులు చెబుతున్నారు. సహజ సిద్ధంగా దొరికే నేరేడు పండ్లలోని ఔషధ గుణం పలు రకాల దీర్ఘకాలిక వ్యాధులకు మందులతో పని లేకుండా మంచి ఫలితాన్ని ఇస్తుందని నిపుణులు చెబుతున్నారు.

ప్రయోజనాలు ఇవే..

శరీరానికి అయ్యే గాయాలకు నేరేడు ఆకులను కట్టుగా కడితే రక్తం కారకుండా నిలుపుదల చేయవచ్చు. ఈ చెట్టు ఆకులు విషాన్ని కూడా పీల్చుకొనే గుణాన్ని కలిగి ఉంటాయి. పొట్టలోని నులి పురుగులను నేరేడు నివారిస్తుంది. నోటి కేన్సర్ నివారణకు కూడా ఎంతో దోహదపడుతుంది. మధుమేహ పీడితులకు నేరేడు పండు ఒక వరం. గింజలను పొడి చేసుకొని ప్రతిరోజు వాటిని నీటిలో మరగబెట్టి, వడకట్టి తాగితే శరీరంలో చక్కెర నిల్వలు అదుపులో ఉంటాయి. మూత్రాశయ సమస్యలకు టానిక్‌లా పనిచేస్తుంది. మూత్రం రాక ఇబ్బంది పడేవారికి ఉపశమనం కలుగుతుంది. నోటిపూత, చిగుళ్ల వ్యాధులు, దంత క్షయంతో బాధపడేవారు నేరేడు ఆకుల రసాన్ని రోజూ పుక్కిలించాలి. నోటిలో చిన్న పూతలు వచ్చినప్పుడు రెండు, మూడు నేరేడు పండ్లను తింటే వెంటనే మంట, బాధ నుంచి విముక్తి కలుగుతుంది. అతిసార రోగులకు సైతం ఈ పండ్లు చాలా మంచి ఔషధం. అయితే గర్భిణులు మాత్రం తినకూడదు.

ఎన్నో విశిష్టతలు

నేరేడు పండ్లను తినడం వలన ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. శస్త్రచికిత్సలు అందుబాటులో లేని రోజుల్లో వైద్యానికి నేరేడు బెరడు, కాయలు, ఆకుల రసాన్ని ఎక్కువగా వినియోగించేవారు. నులి పురుగుల నివారణకు, షుగర్ నియంత్రణకు, నీళ్ల విరోచనాలు తగ్గడానికి నేరేడు పండు ఎంతగానో ఉపయోగపడుతుంది.

– డాక్టర్ కేసీహెచ్ రమేష్, ఆయుర్వేద వైద్యనిపుణుడు, ప్రభుత్వ బోధనాసుపత్రి, రాజమహేంద్రవరం